
# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్‌రాజు





## - 60 -

## పెగ్గీ మార్టిన్ నవ్వించోచ్!

**ముందుగా** అందరికీ ఉగాది శుభాకాంక్షలు. ఈ ఉగాదికి 'హాస్య కౌముది'లో కొత్తగా ఏం చేద్దామా అనుకోగానే 'నువ్వు అన్నీ పాతగానే చేస్తావు. కొత్తగా వ్రాయడమూ రాదు. లెక్కలు అంతకన్నా రావు" అంది క్వీన్ విక్టోరియా. అందులో మొదటి వాక్యం ఇది వరకూ విన్నదే కాబట్టి కాస్త అర్థం అయింది. ఆవిడ తాత్పర్యం ఏమిటంటే 'నువ్వు కౌముది మొదలు పెట్టినా దగ్గర నుంచీ అస్తమానూ ఒహటే సోది.  ఒహటే తరహా. పెద్ద గొప్పగా రెండు, మూడేళ్లకో సారి టైటిల్ మటుకు మార్చేస్తావు. అప్పుడైనా లోపలి సరుకు మారుతుందా అంటే అబ్బే...నీ వల్ల కాదు కానీ కనీసం లెక్క సరిగ్గా పెట్టి నెంబర్ అయినా మార్చు మొగుడూ" అని ప్రైవేటు క్లాసు పీకింది మా క్వీన్ విక్టోరియా.  అనగా కౌముది మొదలు పెట్టిన నాటి నుంచీ ప్రతీ నెలా వ్రాస్తున్నా వారిలో గొల్లపూడి వారి తర్వాత వాడిని నేనే కాబట్టి లెక్క ప్రకారం ఇది కౌముది 184వ సంచిక కాబట్టి నేనూ ఆ నెంబర్ వేసేసు కోవచ్చును. కానీ, గత 15 సంవత్సరాలలో నేను కొన్ని సార్లు 'నెల తప్పాను". అవి తీసేసి సంపాదక దంపతులు కిరణ్ ప్రభ & కాంతి గారి ముందస్తు అనుమతితో ఈ అమెరికులాసా కథ నెంబర్ 173 అని మార్చుకో అని ఆవిడ సలహా అని నాకు అర్థం అయింది. నా నెల తప్పిన లెక్క తప్పు అయితే సంపాదకులు సవరిస్తారు....ఇప్పుడే భారత దేశంలో  వేలాది అభిమానులని కలుసుకుని, అనేక ప్రదేశాలని సందర్శించి, అన్ని టీవీ. బుల్లి తెర ఛానెల్స్ లో అసంఖ్యాకమైన ఇంటర్వ్యూలు ఇచ్చి జైత్రయాత్ర పూర్తి చేసుకున్న కిరణ్ ప్రభ & కాంతి దంపత సంపాదకులని ఈ సందర్భంగా అభినందిస్తున్నాను. వారు చిరకాలంగా పడుతున్న కష్టానికి ఈ సారి తగిన గుర్తింపు రావడమే కాక ఆయన టాక్ షోల వలన ప్రభావితులై, జీవితాలని మెరుగు పరుచుకున్న వారిని  వ్యక్తిగతంగా కలుసుకోవడం  ఒక అసాధారణమైన అనుభవం అనే అనుకుంటున్నాను.



ఇంతకీ ఈ ప్రైవేటు క్లాసు పీకుట మా తోటలో బెంచీ మీద




ఇద్దరం మజ్జిగ తాగుతూండగా జరిగిందనమాట. అనగా మా హ్యూస్టన్ లో శీతాకాలం మెల్లిగా తప్పుకుని వసంత వాతావరణం మొదలయ్యే సూచనలు కనపడడం మొదలయింది. ఈ సారి నేను "ముందే కూసి" మార్చ్ మొదటివారం లోనే రక రకాల అమెరికా పూల మొక్కలు కొనుక్కొచ్చి తోటలో వేశేశాను. అలాగే ఇండియా నుంచి ఒక స్నేహితుడి చేత వంగ, బీర, పొట్ల వగైరా విత్తనాలు తెప్పించుకున్నాను. 'అవి నేల మీద వేస్తే చస్తాయ్" అని ఆవిడ రెండు వారాల క్రితం మజ్జిగ ప్రైవేట్ లో చెప్పడమే కాకుండా "ఇంకా ఎండ బాగా వచ్చే దాకా ఆగు. ముందు ఓ రాత్రి నీళ్ళలో నానబెట్టు" అని కూడా ప్రవచనం చెప్పింది. నేనైతే ఈ ఏడు భారీగా కూరగాయల వ్యవసాయం చేద్దాం అనేసుకుని మనకి చేత కానీ చాకిరీ ఫెర్నాండెజ్ చేత చేయించి, కూరగాయల మళ్ళూ, పూల మొక్కల మళ్ళూ తయారు చేయించి సిద్ధంగా ఉన్నాను. తోట పనికి కావలసిన బల్లా, సామాగ్రీ ఏర్పాటు చేసుకుని ఆ విత్తనాలు ముందు చిన్న చిన్న జీఫ్పీ పాట్స్ అనే మట్టి కానీ మట్టి పిడతల్లో వేసేశాను. మీకు నమ్మకం కోసం నేను ఏక్షన్ లో ఉన్న ఫోటో ఇక్కడ పెట్టాను. "నీ కోతలు నమ్మే వాళ్ళెవరూ లేరులే" అని ఆవిడే ఈ ఫోటో తీసిపెట్టింది..ప్రూఫ్ కోసం. జాగ్రత్తగా గమనిస్తే, ఆ జీఫ్పీ పాట్స్, పేపర్ కప్పులూ, "విత్తనములు బాగా మొలిపించు ప్రత్యేక మట్టి, మశానమూ", అదేదో నాకు ఎప్పుడూ అర్థం అయి చావని పైన్ బార్క్మల్చ్, నీళ్ళు పోయు జారీ...ఇలాంటి వన్నీ ఈ బల్ల పైనా కిందనా కనపడతాయి. కిందటి వారానికి అన్ని విత్తనాలూ వేసేసి రోజూ గంటకోసారి వెళ్ళి ఏమన్నా మొలిచాయా అని నేను చూసుకోడం, "ఆ తెగ మొలిచాయి. వెళ్ళి క్షవరం చేయించుకుని రా" అని మా క్వీను విక్టోరియా వెటకారాలతో కాలం గడుస్తూ ఉండగా మా పక్క పేటలో "ఇల్లూ–తోటా" .అనగా హోమ్ & గార్డెన్ షో ఉంది అని తెలిసింది. అమెరికాలో ప్రతీ నగరం లోనూ ఈ వసంత కాలం వచ్చినప్పుడు ఇలాంటి ప్రదర్శనలు భలే బాగా జరుగుతాయి. మా చిన్నప్పుడు కాకినాడలో సంక్రాంతి సమయంలో కలెక్టర్ గారి ఆధ్వర్యంలో ఫలపుష్ప ప్రదర్శన జరిగేది. అందులో మొక్కలూ, పళ్ళూ, ఫలాలే కాక ఆవకాయలూ, మార్వాడీలా ఫర్నిచర్ దుకాణాలూ, గుజరాతీ, సింధీల బట్టల దుకాణాలూ,..ఇలా చాలానే ఉండేవి. ఇక్కడ కూడా అలాగే మొక్కలతో పాటు, బాత్ రూమ్ లు, కిచెన్లు బాగు చేసే వాళ్ళు, స్విమ్మింగ్ పూల్ వాళ్ళు ఇలా రకరకాల వ్యాపారాల వాళ్ళు దుకాణాలు పెట్టుకుంటారు. ఒక దుకాణంలో ఒకావిడ వంటింటి దుకాణం తెరిచింది. అందులో ఆవిడ అస్సలు నీటి చుక్క కూడా వాడకుండా ఐదారు రకాల కొత్త డిజైన్ స్టీల్ పాత్రలలో వంట ఎలా చెయ్యాలో చేసి చూపిస్తోంది. అదేదో రేడియేషన్ టెక్నాలజీ వంట ట...కోడి పెట్టనో కూరగాయలనో

తరిగేసి ఆ గిన్నెలో పడేసి నాలుగు నిమిషాలు కుంపటి మీద పెడితే చాలుట...అంతా చేసి చూపించి, అపటికప్పుడు మనం ఆ సెట్టు ఆంతా కొనుక్కుంటే ఆరు గిన్నెలూ, ఆరు మూతలూ,  ఆరు గరిటెలూ, డబ్బా ఉప్పూ, వంటల పుస్తకమూ అన్నీ కలిపి నెలకి $19.99 మాత్రమే ట. “ఓస్ అంతే కదా. భలే మంచి చౌక బేరమూ” అని నేను సంతకం పెట్టెయ్యబోతుంటే నా పక్కనే నుంచుని ఆ డిమాన్ స్ట్రేషన్ చూస్తున్న మన గుజరాతీ ఆవిడ  అవతల పక్కన నుంచున్న మొగుడేమో అనుకుని ఇవతల పక్కన అమాయకంగా నుంచున్న  నా డొక్కలో మోచేత్తో పొడిచింది. నేను కెవ్వుమనే లోగా ఆ వీరుడు నన్ను చూసి ఒక వెకిలి నవ్వు నవ్వి ‘ఒక నెల కాదు సార్. ఎనిమిదేళ్ళు కట్టాలి సార్. మన వయసెంతా?” అని వెధవ ప్రశ్న వేశాడు. అప్పుడు నాకు ఆ వంటావిడ చేసిన మేజిక్ ఆంతా అర్ధం అయి, నన్ను డొక్కలో పొడిచి జ్ఞానోదయం కలిగించిన కుముద్ బెన్ కి దణ్ణం పెట్టి మిగతా స్టాల్స్ వేపు వెళ్ళిపోయాను. ఇక ప్రతీ స్టాల్ కీ వెళ్ళి , వాళ్ళు  ఫ్రీగా ఇచ్చే చాక్ లెట్లు,  పెన్నులు, టోపీలు, ప్లాస్టిక్ గిన్నెలూ వాళ్ళే ఇచ్చిన సంచీలో వేసేసుకుని నాకు కావలసిన నాలుగు పూల మొక్కలూ, ఒక మేలి రకం కమలా ఫలం మొక్కా కొనుక్కొచ్చాను.  ఇలాంటి ప్రదర్శనలకి క్వీన్ విక్టోరియాని తీసుకెళ్ళడం ఆరోగ్యకరం కాదు అని పైన డొక్కలో పొడిచిన కుముద్ బెన్ తగిన సాక్ష్యమే కదా!.

ఆ సాయంత్రం ప్రేవేటు క్లాసులో ఇలా మజ్జిగ గ్లాసు పట్టుకుని బెంచీ మీద కూచుని ఈ కుముద్ బెన్ సంగతి చెప్పాలా వద్దా అని డొక్క గోక్కుంటూ ఉండగా మా క్వీన్ విక్టోరియా సంభ్రమాశ్చర్యాలతో లేచి నుంచుని “అదిగో చూడు. పెగ్గీ మార్టిన్ నవ్వుతోంది” అని తోటలోకి పరుగెట్టింది.

“అలాగా, రియల్లీ...అప్పడే” అని నేను కూడా వెళ్ళి ఆ  పెగ్గీ మార్టిన్ ని చేతులతో ఆప్యాయంగా హత్తుకున్నాను. పెగ్గీ మార్టిన్ అంటే అమ్మాయి పేరే కానీ అమ్మాయి కాదు సుమా. పెగ్గీ మార్టిన్ అంటే టెక్సస్, లూజియానా ప్రాంతాలలో



ఎన్ని తుఫానులు వచ్చినా నిలదొక్కుకుని విరబూసే గులాబీ పువ్వుల తీగె. 2005 లో హరికేన్ కత్రినా విలయతాండవం చేసినప్పుడు లూజియానా రాష్ట్రం లో మార్టిన్ అనే ఒక బాగా పేరున్న పూల మొక్కల పెద్దాయన ఇల్లు ఏకంగా రెండు వారాల పాటు 20 అడుగుల నీట్లో మునిగి పోయింది. కానీ ఈ గులాబీ పాదు ఒకటే తట్టుకుని నిలబడింది. ఆ తర్వాత టెక్సస్ A & M యూనివర్శిటీ వారు ఆ గులాబీకి అంటు కట్టి, పెగీ మార్టిన్ అని నామకరణం చేశారు. అందమైన పువ్వులతో, ముళ్ళు లేకుండా చక చకా

పాకే ఆ పెగీ మార్టిన్ మొక్కలు రెండు మేము శీతాకాలం ముందు కొని మా తోటలో వేశాం. రెండూ వారాల క్రితమే దానికి కావలసిన ఎప్సమ్ సాల్ట్ ఎరువు వేసి రోజూ ఎప్పుడా ఎప్పుడా ఎదురుచూస్తున్న ముహూర్తం మొన్న రానే వచ్చింది. అప్పుడే పది మొగ్గలు కనపడగా నిన్న రెండు పువ్వులు చిద్విలాసంగా మిమ్మల్ని చూసి నవ్వాయి. శీతాకాలానికి వీడ్కోలు. వసంతానికి స్వాగతం. అందరికీ ఉగాది శుభాకాంక్షలు.

**COMMENTS**